

అత్యంత ప్రీతిపాత్రులైన తన తల్లీ, తండ్రీ మరణించాక జీవించి లాభమేమిటనుకున్నాడు ఆత్మహత్య చేసుకోవా లనుకున్నాడు. కానీ, దాన్ని ఆచరణలో పెట్టేంత ధైర్యం తనకులేదు. "కష్టాలను గుండెనిబ్బరంతో సహించి, ధైర్యంగా ఎదుర్కొనే వాడి జీవితం తప్పక సుఖాంతం అవుతుందని" తన తండ్రి చెప్పిన మాటలు తనకు జ్ఞాపకం వచ్చాయి. తప్పకుండా యెప్పటికైనా మంచిరోజులు వస్తాయనీ, శాంతీ, సుఖం తప్పకుండా తనకు లభిస్తాయనీ, అంతరాత్మ ప్రబోధించినట్టయింది.

ఫలితంగా మర్నాడే వుద్యోగంలో చేరిపోయాడు. అప్పటినుంచీ తన జీవితంలో కొత్త మార్పు వచ్చింది. 'ఆఫీసు'కు వెళ్ళడం, యంత్రంలా పనిచేయడం, హొటల్లో భోజనం చేయడం సాయంత్రం పార్కుకువెళ్ళి కూర్చుని ఆడుకుంటున్న చిన్న చిన్న పిల్లల్నీ, సువాసనల్ని వెదజల్లుతూ, రకరకాల రంగులతో మెరిసిపోయే పువ్వుల్నిచూస్తూ, కాస్సేపు గడిపి యింటికి వెళ్ళిపోవడం, యేదైనా చదువుతూ కొంతకాలం గడిపి, తరువాత నిద్ర పోవడం—యిది తన దినచర్య అయింది. ఇలా రెండు సంవత్సరాలు యే మార్పు లేకుండా దొర్లిపోయాయి. తరువాత తన జీవితం మరో కొత్త మలుపు తిరిగింది.

ఈ రెండేళ్లలోనూ, ఒక్కరోజూ తను పార్కుకు వెళ్ళడం, మానివేసినరోజు లేదు. పార్కులో ఒక ముసలాయనతో పరిచయం అయింది. ఈ రెండేళ్ళ లోనూ తనసాన్నిహిత్యం బాగా యెక్కువైంది ఆయన కూడా యేదో ఆఫీసులో గుమాస్తాగాచేసి 'రిటైర్' అయినవారు' ఆయనకు ఆరుగురు ఆడపిల్లలు. ఐదుగురికి యెలాగో కష్టపడి పెళ్ళిచేసి భారం తీర్చుకున్నాడు. ఇక ఒక అమ్మాయి మిగిలిపోయింది. అడిగినంతకట్నం యిచ్చుకోలేక ఆపిల్ల కాయన పెళ్ళి చేయలేదు. "ఆ అమ్మాయి నా గుండెలమీద కుంపటిలా తయారయింది బాబూ : మీకు తెలిసిన సంబంధాలు యేవైనావుంటే చూడండి" అన్నాడాయన ఒకసారి ఆయన దిగులుచూసి తను చలించిపోయాడు. 'అలాగే'నని మాట యిచ్చాడు. ఒకసారి ఆయనింటికివెళ్ళి ఆ పిల్లను చూడడం తటస్థించింది ఆమె వినయాన్ని, సౌందర్యాన్నీ చూడగానే "నేనే ఆమె నెందుకు వివాహం చేసుకోగూడ దనిపించింది. రెండురోజులు ఆలోచించి తన నిర్ణయం సరిఅయినదేనని నిశ్చయించుకుని మర్నాడాయనకు తననిర్ణయాన్ని తెలియజేశాడు. ఆయన చాలా ఆనందించాడు. ఆ సంవత్సరమే వేసవిలో శారద తన భార్యయిపోయింది.

"జీవితంలో కష్టసుఖాలు సమానమైనవి. రెండింటినీ భరించగల్గినప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది. ఇప్పటిదాకా కష్టాలనుభవించిన నేను యికనుంచి సుఖపడాలని రాసివున్నదేమో" అనుకునేవాడు అప్పుడప్పుడూ శారదతో జీవితం చాలా ఆనందంగా గడిచింది తన కెందులోనూ లోటు కలగకుండా చూసుకునేది ఆమె ఆమె సాన్నిధ్యంలో గతజీవితంలో తా ననుభవించిన కష్టాలన్నీ మరిచిపోగలిగేవాడు

తన అంచనా తప్పని మరో రెండు సంవత్సరాల తర్వాతగానీ తెలియలేదు.

# చిత్రమైన కామెడీ

17-వ పేజీ తరువాయి

నవ మాసాలు నిండిన శారదను తను హాస్పిటల్లో చేర్పించాడు

శారద ప్రసవించేరోజు దగ్గిరపడేకొలదీ మనస్సులో ఆందోళన యెక్కువ కాసాగింది. 'ప్రసవం స్త్రీకి పునర్జన్మలాంటి'దనే సంగతి గుర్తుకొచ్చి తన గుండెలు తల్లడిల్లిపోయేవి. ఆవేళ తనకు ఉద్యోగంలో 'ప్రమోషను' వచ్చిందని తెలిసింది. ఆ సంతోషవార్తను వినిపించాలన్న వుద్దేశంతోనూ, శారద కెలావుందోనన్న ఆదుర్దాతోనూ ఆఫీసు వదలగానే గబగబా ఆసుపత్రికి వెళ్ళాడు. హాస్పిటలుకు వెళ్లేటప్పటికి శారదకు 'సీరియస్'గావుందని తెలిసింది. మరి కాస్సేపటికి మగపిల్లవాడిని ప్రసవించి శారద మృత్యువువాత పడిందని నర్సువచ్చి చెబు

ఒక ఏనుగు అడవిలో నడుస్తూ వెడుతున్నది. పైన కొమ్మలలో ఒక కోతి మామిడికాయ తిని టెంక ఏనుగుమీదకి విసిరింది. సరిగ్గా అదే సమయంలో ఏనుగు ముల్లు మీద కాలు వేసి, బాధతో, "అబ్బా!" అని మూలిగింది.

"బాధగా ఉందా? సెలీక వేశానులే!" అన్నది కోతి వెటకారంగా.

కె. వి. రావు (మైసూరు)

తుంటే కళ్ళముందు ప్రపంచమే గిర్రున తిరిగినట్టయింది నిశ్చేష్టుడై, అలాగే నిలబడిపోయాడు - అది విధి తన జీవితంలో పెట్టిన మూడవ గొడ్డలిపెట్టు. . . .

ఉద్యోగంలో ప్రమోషను వచ్చినందుకు సంతోషించాలో, శారదను మరణించినందుకు దుఃఖించాలో, చివరికి కుర్రాడైనా దక్కినందుకు సంతృప్తిపడి వూరుకోవాలో తెలియలేదు తనకు చితిలో కాలిపోతున్న శారదను చూస్తూవుంటే చటుక్కున ఒక అనుమానం మనసులో మెదిలింది. తను బి. ఏ. పాసయ్యాక తండ్రి మరణించడానికి, ఉద్యోగం వచ్చాక తల్లి యీ లోకాన్ని వదలడానికీ, ఉద్యోగంలో ప్రమోషను వచ్చాక శారద కన్నుమూయడానికీ యేదైనా సంబంధం వున్నదేమో ననిపించింది

అందంగా, శారదపోలికలతోనేవున్న ఆ పసివాడి పోషణలో ఆనందం లభించేది తనకు తన జీవితం పూర్తిగా మారిపోయింది వాడికి 'గోపీ' అని పేరుపెట్టి కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చాడు.

వాడిని పెంచడంకోసం రెండోపెళ్ళి చేసుకోమని కొంతమంది సలహా లిచ్చినా, గోపీ శ్రేయస్సు కోరి ఆ ఆలోచనల్ని తన దగ్గరకు రానీయలేదు. గోపీని తన ఆరవ ప్రాణంగా పెంచాడు. చీకట్లైపోయిన తన జీవితానికి వాడు వెలుగురేఖలాంటివాడు. ఆ ఒక్క కాంతికిరణమూ ఆరిపోతే తన జీవితమే చీకట్లైపోతుంది. గోపీ పెరిగి పెద్దవాడై వున్నతమైన స్థానాన్నిపొంది గౌరవంగా సుఖంగా జీవించాలి. అదొక్కటే తన లక్ష్యంగా పనిచేసేవాడు. ఇలా తొమ్మిదిసంవత్సరాలు నిరాటంకంగా నిశ్చింతగా గడచిపోయాయి మళ్ళీ యిన్నాళ్ల తరువాత తన పాత జీవితాన్ని, అనుభవాల్నీ జ్ఞప్తికితెచ్చి, తన మనస్సులో అలజడి కలుగజేసి, భవిష్యత్తును శంకింపచేసే సంఘటన జరిగింది ఆవేళ ఉదయం తనకు మళ్ళీ ప్రమోషను వచ్చిందని తెలిసింది. మేనేజరు ప్రొద్దున తనను పిలిచి ఉద్యోగులందరిలోకీ బాగా శ్రద్ధగా పనిచేసి, ప్రమోషను సంపాదించినందుకు తనను అభినందించాడు. తనకు గుండె ఆగినంత పనయింది. తలనొప్పి సాకుతో ఆఫీసుకు శలవుపెట్టి యింటికి వెళ్ళిపోతున్న తనను చూచి సహోద్యోగులూ, మేనేజరు విస్తుపోయారు. తన జీవిత మెంత చిత్రమైనదీ వాళ్లకు తెలియదు."

గోడ గడియారం టంగుమని గంట కొట్టింది. నరహరి ఆలోచన లాగిపోయాయి. తలెత్తి చూశాడు. పదిన్నర చూపిస్తోంది గడియారం. గడియారం చేసే శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది.

నరహరి మళ్ళీ గోపీవైపు చూశాడు. వాడు నిశ్చింతగా నిద్రపోతూనేవున్నాడు. "తనకు బహిః ప్రాణమైన వీడూ తన్ను వదలిపెట్టి వెళ్ళిపోతే తానిక జీవించగలడా" అనిపించింది. కళ్ళు మూసుకుని, "భగవాన్! ఇప్పటికే యిన్నిసార్లు నన్ను కష్టాల్లో ముంచావు. ఇక నా జీవితంలో వీడొక్కడే నాకు దక్కేట్టు చూడు ఇప్పటివరకూ నిశ్చింతగా ఒక విధమైన శాంతితో వాడిని చూసుకుంటూ, పాత దుఃఖాలను మరచిపోయి, భవిష్యత్తుమీద కొన్ని ఆశలు పెట్టుకుని జీవితం గడుపుతున్న నన్ను మళ్ళీ దుఃఖ సముద్రంలో విసిరివేయకు తండ్రీ! నాకు జీవితంలో మిగిలిన ఈ ఒక్క ఆశాదీపాన్ని ఆర్పివేయకు" అనుకుంటూ పడుకున్నాడు మరుక్షణంలో అతడికి గాఢమైన నిద్ర పట్టింది.

* * *

మర్నాడు ప్రొద్దున నరహరి లేచేటప్పటికి బాగా తెల్లవారిపోయింది. ప్రక్కన గోపీలేడు రోజూ తెల్లవారుజామునే లేవడం అలవాటు వాడికి. నరహరి మంచంమీంచి లేవలేకపోయాడు వంట్లో నీరసంగా వుంది కొద్దిగా జ్వరం తగిలిన లక్షణాలు కన్పడ్డాయి నిస్సహాయంగా మంచంమీదే కాస్సేపు కూర్చుని, తరువాత కష్టపడిలేచి మొహం కడుక్కోవడానికి దొడ్లోకి వెళ్లాడు. గోపీ వంటింట్లో కూర్చుని కాఫీ కాస్తున్నాడు వాడప్పుడే స్నానం చేసి క్రొత్త బట్టలు వేసుకున్నాడు

నరహరి మొహం కడుక్కుని వచ్చేటప్పటికి గోపీ కాఫీ తీసుకు వచ్చేశాడు. నరహరి తాగుతున్నంత

సేవూ వాడు ప్రక్కనే నిలబడ్డాడు. వాడేదో అడగబోతున్నాడని నరహరి అర్థం చేసుకున్నాడు. కాఫీ తాగగానే, "నాన్నగారూ! యివాళ ప్రొద్దున్న ఎనిమిదిగంటలకి మాస్టరు స్కూలుకి రమ్మన్నారండీ. ఇవాళ ఆదివారం కాబట్టి బడికి సెలవైనా రేపు స్కూలు వార్షికోత్సవంలో మేమంతా 'డ్రామా' ఒకటి వేస్తున్నాము కాబట్టి యివాళ ఆఖరి 'రిహార్సలు'కు రమ్మన్నారండీ "వెళ్లనాండీ" అన్నాడు వాడు. నరహరి యిరుకున పడ్డాడు. 'వాడిని వెళ్లనివ్వకపోతే నిరుత్సాహపడిపోతాడు. వెళ్ళనిస్తే తప్పక యేదో ప్రమాదం సంభవిస్తుందని తన కనిపిస్తోంది. ఏం చెయ్యాలి' కాస్సేపు సందిగ్ధంలో పడ్డాడు. ఏదో జరుగుతుందని తెలిసివుండీ, వాడిని వెళ్ళనివ్వడం మూర్ఖత్వమేననిపించింది. "ఇవ్వాళ వెళ్లకురా. ఇక్కడే యింటి దగ్గరే వుండు' అన్నాడు చివరికి. గోపీ నిరుత్సాహపడిపోయాడు. "అది కాదండీ నాన్నగారూ, మా మేష్టరూ......" యేదో చెప్పబోయాడు గోపీ. కాని తండ్రి మొహంలోకి చూసి ఆగిపోయాడు. "గుమ్మం కదిలావంటే తంతాను. కదలకుండా యిక్కడే కూర్చో" అనరిచాడు నరహరి. తన గొంతులో ధ్వనించిన కర్కశత్వాని కతడికే ఆశ్చర్యం వేసింది. 'ఎప్పుడూ ఒక్కమాట కూడా అనని తనీవేళ యిలా మారిపోయాడేమిటి' అనుకున్నాడు తనలో తనే. గోపీకి తండ్రి మాటలు కొత్తగా కన్పించాయి. 'ఇవాళ నాన్న యిలా మారిపోయారేమిటి?" అనిపించింది వాడికి. తన తండ్రి యెందుకు బడికి వెళ్ళవద్దంటున్నారో వాడి కర్థం కాలేదు. 'రిహార్సల్సుకు రాకపోతే మాష్టారేం చేస్తారో' అన్న భయం వాడి నావహించింది. వాడి కళ్లల్లో నీళ్ళు నిండాయి. నిరుత్సాహంతో బొమ్మలా కూర్చుండిపోయాడు.

పది నిముషాలు గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది. నరహరి ఆలోచిస్తూ కూర్చున్నాడు. గోపీని వెళ్లనివ్వడం భావ్యమేనా అని. పోనీ తను వెంటవుండి తీసుకువెళదామంటే జ్వరంవచ్చి పడింది. ఈ జ్వరంతో బయటకు వెళ్ళడం అసాధ్యం.

"గోపీ". . . .బయటనుంచి కేక వినపడింది. గోపీ లేచి వెళ్లాడు. బయట వాడి క్లాసు పిల్లలు నిలబడి వున్నారు. "మాస్టారు నిన్ను వెంటనే తీసుకు రమ్మన్నారు. అందరూ వచ్చారు. నువ్వొక్కడివే రాలేదని మాస్టారికికోపంగావుంది. వెంటనే మాతోరా" అన్నారు వాళ్ళు. "మా నాన్నగారు వెళ్ళవద్దన్నారు. మీరు వెళ్ళండి. నేను రాను" అన్నాడుగోపీ. "రాకపోతే నీ పని రేపు వుందిలే. పేంబెత్తంతో పెళ్ళి చేస్తానన్నారు మేష్టారు" కుర్రాళ్ళు హెచ్చరించి వెనక్కు తిరిగారు. గోపీకి కన్నీళ్లాగలేదు. పొంగి వస్తున్న యేడుపు నెలాగో దిగమింగి కళ్ళు తుడుచుకున్నాడు. ఇది చూసిన నరహరి చలించిపోయాడు. కొడుకు మీది ప్రేమ, వాత్సల్యం అతడిలో కట్టలు తెంచుకున్నాయి. లేచివెళ్ళి వంకీకి తగిలించిన చొక్కా తీశాడు. జేబులోంచి పర్సుతీసి అందులోంచి ఒక రూపాయితీసి గడప దగ్గరకు వెళ్లాడు. ఆ రూపాయను గోపీ జేబులోపెట్టి, "గోపీ, స్కూలుకు వెళ్లరా. కానీ త్వరగా వచ్చేసెయ్యి. వచ్చేటప్పుడు యీ డబ్బుపెట్టి మిఠాయి కొనుక్కో" అన్నాడు. గోపీ మొహం సంతోషంతో విప్పారింది. "ఒరేయ్

# చిత్రమైన కామెడీ

గోపీ!" నరహరి పిల్చాడు. "వెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ రోడ్డు ప్రక్కనే నడు. అడ్డంగా పరిగెట్టకు. రిహార్సలయిపోగానే వచ్చేసెయ్యి. బస్సులూ, లారీలు తెగ తిరుగుతుంటాయి జాగ్రత్త". "అలాగే నాన్నా" గోపీ కనుచూపుమేర దాటిపోయేవరకూ నరహరి చూస్తూ నిలుచుండిపోయాడు.

గోపీ దృష్టిపథంలోంచి తప్పుకున్నాక నరహరి లోపలికివచ్చి, "యీజీచైర్"లో కూలబడిపోయాడు ఇప్పు డతడిని ఓ ప్రశ్న వేధించసాగింది. 'గోపీని బడికి వెళ్ళమని తాను చేజేతులా వాడిని తనకు దూరం చేసుకుంటున్నాడా?' బెల్లంచుట్టూ మూగే ఈగల్లా ఆలోచన లతడిని చుట్టుముట్టాయి. వాడిని పంపడం మూర్ఖత్వమేనేమో ననిపించింది. 'వాడిని నిరుత్సాహపరచడం యిష్టంలేక, వాడి కళ్ల నీరు చూడలేక నేనలా చేశాను' అని సమాధానం చెప్పుకున్నాడు. కాని ఆ సమాధానం అతడికి సంతృప్తి

---

ఒక గజదొంగని కొరత వేశారు. దారినే వెడుతున్న ఒకరు అతని వీపు నిమురటంతో దొంగ బాధగా, "అంత బాధగా లేదు లెండి?" అన్నాడు.

"అబ్బె, అందు క్కాదు. ఇంకా కొరత ఇటువైపుకి పొడుచుకు రాలేదే అని చూస్తున్నా!" అన్నాడు బాటసారి.

యం. వెంకయ్య (మద్రాసు)

---

నివ్వలేదు. అది తను చేసిన తప్పునూ, పొరబాటునూ కప్పి పుచ్చుకోవడంకోసం చెప్పుకున్న సాకులా తోచింది. 'అయితే వాడిని పంపించడంలో తను తప్పే చేశాడా?" 'అవు'నవునని లక్ష గొంతులు హెచ్చరెత్తినట్లనిపించింది నరహరి మనస్సులో. గతంలో తనకు బి. ఏ. లో ఫస్టు క్లాసులో ఉత్తీర్ణుడైనట్లు తెలియగానే, మర్నాడే తండ్రి మరణించడం, ఉద్యోగం వచ్చిన మర్నాడు తల్లీ, ప్రమోషను వచ్చిన మర్నాడే భార్యా ఈ లోకాన్ని వదలడం మనస్సులో మెదిలింది నరహరికి. ఈసారి మళ్ళీ తనకు 'ప్రమోషను' వచ్చింది. ఇది తన గోపీని బలితీసుకుంటుందా?" ....... నరహరి నిలువెల్లా వణికిపోయాడు.

"సార్" . . . . నరహరి ఆలోచనాప్రవాహాని కానకట్ట పడింది. గుమ్మందగ్గరే 'పేప'రిచ్చే కుర్రాడు నిలబడివున్నాడు నరహరి లేచివెళ్ళి పేపరందుకున్నాడు పేపరు కుర్రాడు వెళ్ళిపోయాక నరహరి వచ్చి 'యీజీచైర్'లో కూర్చున్నాడు. పేపరు తెరవ బుద్ధవకపోయినా, మనస్సును అనేక కోణాల నుండి చుట్టుముట్టి బాధపెడుతున్న వికృతమైన ఆలోచనలనుండి తప్పించుకోవడానికి దానిని తెరిచి ముఖ్యమైన శీర్షికలు చూడడం మొదలుపెట్టాడు. రెండవ పేజీ తిరగవెయ్యగానే నరహరి గుండె స్తంభించినంత పనయింది. అందులో ఒక 'ఫోటో' ముద్రించ బడివున్నది. ఆ ఫోటోలో లారీక్రింద పడి రక్తంలో నిర్జీవంగా పడివున్న పసివాడొకడు స్పష్టంగా కన్పిస్తున్నాడు.

ఆ 'ఫోటో' క్రింద ఒక పెద్ద వ్యాసం వున్నది : ఆ వ్యాసంలో లారీ ప్రమాదాలు, వాటి ఘోర ఫలితాలు, వాటిని తగ్గించడానికి 'లారీ డ్రైవర్లు' ప్రజలు చేయువలసిన కృషి, ముఖ్యంగా పన్నెండేళ్ళ లోపు పిల్లలను బళ్ళకు పంపేటప్పుడు తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలైన విషయాలు విపులంగా చర్చించబడ్డాయి. నరహరి మ్రాన్పడిపోయాడు. అతడి మనస్సులో ఆందోళన పదిరెట్లు పెరిగింది. 'తానేదైతే కాకూడదని భగవంతుని ప్రార్థిస్తున్నాడో అదే జరుగుతుందా?' రక్తపు ముద్దలా రోడ్డుమీద రక్తపు మడుగులో పడివున్న ఆ కుర్రాడి బొమ్మ నరహరిని కదిల్చివేసింది. 'తన గోపీని కూడా యిదే స్థితిలో చూస్తాడా తను?. . . .' ఒక విధమైన భయం, అనుమానం నరహరిని ఆవహించాయి. అతడు తలెత్తి చూశాడు. గడియారం పది గంటలు చూపిస్తోంది. గోపీ వెళ్ళి సుమారు రెండు గంటలయింది. ఈపాటికి 'రిహార్స'లయిపోయి వాడు యింటికి వచ్చేసివుండాలి. 'ఇంకా రాకపోడానికి కారణం?. . . .బహుశా యీ పాటికి వస్తుంటాడేమో. మరో అరగంటవేచి చూస్తే సరి.'

గడియారం పదిన్నర చూపిస్తోంది. ఇంకా గోపీ రాలేదు. 'తనిప్పుడేం చెయ్యాలి'. . . .నరహరి సందిగ్ధంలో పడ్డాడు. "తను స్కూలుకు వెళ్ళివస్తే? దారిలో యెదురైతే వాడిని తీసుకుని యింటికి వచ్చివేయవచ్చును. నరహరి స్కూలుకు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. తనకు జ్వరం వచ్చిన విషయం, వంట్లో నీరసం అతడికి జ్ఞాపకం రాలేదు. 'గోపికి యే విధమైన ప్రమాదమూ రాకుండా చూసుకోవాలి' అదొక్కటే అతడి ఆలోచన. నరహరి యింటికి తాళంవేసి మెట్లు దిగాడు. వంట్లో నిస్సత్తువగా వున్నట్లనిపించలేదు. గబగబా స్కూలుకు నడక ప్రారంభించాడు. స్కూలు అక్కడినుంచి మూడు ఫర్లాంగులుంటుంది. అర ఫర్లాంగు నడవగానే వంట్లో నీరసం తెలియ నారంభించింది నరహరికి. కళ్ళు తిరిగినట్టయి, పడబోయి, తమాయించుకున్నాడు. మనస్సులో పేపర్లో పడ్డ కుర్రవాడి బొమ్మ మెదులుతున్నది.

కళ్ళు తెరిచివున్నా, అతడి కళ్లకు, మనుష్యులూ, బళ్ళూ కన్పించటంలేదు. 'హాస్పిటల్లో' 'బెడ్డు'మీద ఆపాదమస్తకమూ తెల్లటి గుడ్డతో కప్పివేయబడ్డ తన తండ్రి భౌతికదేహం, నుదుటినుంచి కారుతున్న రక్తంవల్ల వికృతంగా చేయబడ్డ తల్లి మొహం, తన్ను చూడకుండానే చివరి శ్వాసను వదలి ఒక బాధ్యత నెత్తిమీద పెట్టి వెళ్ళిపోయిన శారద. . . .కదులుతున్నారు. గోపీ. . . .వీడొక్కడైనా తనకు దక్కాలి. వాడిని తాను రక్షించుకోవాలి !. . . .నరహరి రెక్క పట్టుకుని యెవరో ప్రక్కకు లాగారు. ఉలిక్కిపడ్డాడు. ప్రక్కనుంచి లారీ శరవేగంతో దూసుకుపోయింది. 'లేచినవేళ

మంచిది. లేకపోతే చక్రాలకింద వుండేవాడు' అంటున్నారెవరో.

ఎలాగో రెండు ఫర్లాంగులు నడిచాడు నరహరి కాళ్ళు తేలిపోతున్నా, తలనొప్పి విపరీతంగా బాధ పెడుతున్నా, నడక ఆపలేదు. ఒక ఫర్లాంగు నడిస్తే గోపీ స్కూలు వచ్చేస్తుంది. వాడే ప్రమాదంలోనూ, చిక్కుకోకుండా సజీవుడై వుంటే భగవంతుడు తన్ననుగ్రహించినట్లే. . . .' ఆలోచిస్తూ నడుస్తున్న నరహరి కళ్ళు మెరిశాయి. ఓ వంద గజాల దూరంలో రోడ్డు కటువైపువున్న 'పేవ్‌మెంట్' మీద గోపీ కన్పించాడు. వాడి వీపు తనవైపు త్రిప్పి వున్నది. బహుశా యేదైనా గారడీ జరుగుతూ వుండవచ్చును. తదేకంగా వాడటే చూస్తున్నాడు. వాడి ప్రక్కన యింకా చాలామంది చేరారు. పేవ్‌మెంటంతా గుంపుతో నిండిపోయింది. నరహరి అవతలి వైపుకు వెళ్ళి వాడిని కలుసుకోవాలనుకున్నాడు. కానీ లారీలూ, కార్లూ, బస్సులూ క్షణాని కొకటి చొప్పున యిటూ, అటూ హడావడిగా పరుగెడుతున్నాయి. 'రద్దీ తగ్గాక వెళ్ళవచ్చు'నని అక్కడే నిలబడ్డాడు. ఇంతలో ఆ గుంపులో తోసుకోవడం, తుమ్ముకోవడం యెక్కువయింది. పేవ్‌మెంటుమీద నుంచి క్రిందికి ఒకర్నొకరు తోసుకుంటున్నారు. 'గోపీని క్రిందికి తోసేస్తారేమో' ననుకున్నాడు నరహరి. అతడి ఆందోళన యెక్కువయింది. 'వాడినా గుంపులోనుంచి యివతలికి తీసుకు రావాలి' అనుకున్నాడు పేవ్‌మెంటుమీదనుంచి దిగుతూ.

ఇంతలో అతడి కళ్ళను చెదరగొట్టి అతడి ఆందోళననూ, భయాన్నీ, అనుమానాన్నీ ద్విగుణీకృతంచేసే సంఘటన జరిగింది. ఎవరో గోపీని పేవ్‌మెంట్‌మీంచి కిందికి తోసేశారు. వాడు రోడ్డుమీద పడ్డాడు. తలకు గట్టి దెబ్బ తగిలి రక్తం కారుతున్నది. లేవలేకపోతున్నాడు. నరహరి ముందుకు పరిగెత్తాడు. 'లెక్కలేనన్ని కార్లూ, లారీలూ శరవేగంతో తిరుగుతున్న ఈ రోడ్డుమీద తను కాకపోతే మరి తన గోపీ నెవరు రక్షిస్తారు? వాడిని తనే రక్షించుకోవాలి. తన ప్రాణం పోయినా ఫరవాలేదు వాడి ప్రాణాలు దక్కితే తన కదే పదివేలు'....

మెరుపులా పరుగెత్తుకు వస్తున్న నరహరినీ, కింద రోడ్డు కడ్డంగా పడివున్న కుర్రవాడినీ చూచి, మహావేగంతో వస్తున్న రెండు లారీల డ్రైవర్లు తెల్లబోయారు. 'బ్రేక్' వేసినా ప్రయోజనం లేనంత దగ్గరగా వచ్చేశారు. వెనకాల రెండు మూడు బస్సులు కూడా వస్తున్నవి. కంగారులో యెటువైపుకు త్రిప్పాలో, యేమిచెయ్యాలో తెలియక లారీల వేగాన్ని తగ్గించి, వాటి నాపడానికి శాయశక్తులా ప్రయత్నించారు లారీ డ్రైవర్లు. . . .కానీ లాభంలేకపోయింది. కుర్రవాడి నెత్తుకుని పేవ్‌మెంటువైపు పరుగెత్తుతున్న నరహరిమీదికి అస్తవ్యస్తంగా తిరుగుతున్న లారీ ఒకటి వచ్చేసింది తలమీద సమ్మెటలతో కొట్టినంత బాధ, గుండెల్ని యినప హస్తాలతో నొక్కినంత బాధ, చెవుల దగ్గర సముద్రపు హోరు లాంటి శబ్దం... యివే నరహరికి జ్ఞాపకం వున్నాయి. తరువాత అతడికి స్పృహ తప్పిపోయింది.

"ఆంబులెన్సులో హాస్పిటలుకు తీసుకు వెళుతుండగా స్పృహ వచ్చింది నరహరికి. బలహీనంగా వుంది. ఒంట్లో చాలా నీరసంగా వుంది. నరహరి తలను భారంగా యిటూ అటూ కదిపాడు. అతడి కళ్ళకు తనకు కొద్దిదూరంలో బల్లమీద పడుకోబెట్టిన కుర్రాడు కన్పించాడు. అతడితలకు యేదో చిన్న కట్టు కట్టారు. తాత్కాలికంగా రక్తప్రవాహాన్నాపడానికై యుండవచ్చును. నరహరికి చటుక్కున మనస్సులో యేదో మెదిలింది : "అయితే తను రక్షించింది యీ కుర్రావాడినేనా ?"

మళ్ళీ ఆ అబ్బాయివంక చూశాడు. వాడూ గోపీలానే వున్నాడు. అదే యెత్తు, అదే ఆకారం. అయితే తనకళ్ళు తన్ను మోసగించాయన్నమాట. తను పొరబడ్డాడు. యీ అబ్బాయినే తను రక్షించింది. మరి గోపీ యేమయ్యాడు?' నరహరికి యేమీ అర్థం కాలేదు. మళ్ళీ భయానుమానాలు అతడి మనస్సులో స్వైరవిహారం ప్రారంభించాయి...


'హాస్పిటల్లో బెడ్'మీద కళ్ళు తెరిచిన నరహరికి యెదురుగా 'స్టెతస్కోపు' ధరించి, తనవంక ఆదుర్దాగా చూస్తున్న 'డాక్టరూ' అతడి ప్రక్కనే నిలబడివున్న 'నర్సూ' కన్పించారు. 'డాక్టర్'. . . .నరహరి లేవబోయాడు. "అబ్బే, లేవకండి. మీకు తలకు చాలా గట్టి దెబ్బ తగిలింది. యింతకుముందు కట్టిన కట్టు అప్పుడే రక్తంతో తడిసిపోయింది. మళ్ళీ మరో కట్టు కట్టాలి' అన్నా డాయన. "నా విషయం మీరేమీ భయపడనక్కరలేదు డాక్టర్. మీరొక చిన్న సహాయం చేసిపెట్టగలరా' అన్నాడు నరహరి.

'అలాగే' నన్నాడు నరహరి మాటలకు తెల్లబోయిన ఆయన.

"మీరు సెంటరో దగ్గరేవున్న ఎలిమెంటరీ స్కూలుకు యెవరినైనా పంపి, నా కొడుకు గోపీ అక్కడ వున్నాడేమో కనుక్కోవాలి. అలా చేయగలరా?" అన్నాడు నరహరి. డాక్టర్ 'సరే'నని వెళ్ళిపోయాడు.

నరహరికి క్షణం యుగంలా గడుస్తున్నది. గోపీని రక్షించా ననుకొని తానెంతో సంతోషించాడు. కాని తాను కాపాడింది మరో కుర్రాడిని. అందుకు తనెంతో సంతోషించవచ్చును. కానీ తన గోపీ గురించిన అనుమానం తన్ను వేధిస్తోంది. వాడు సురక్షితంగావుంటే తన హృదయభారం తగ్గిపోతుంది. తనకు వెయ్యి ఏనుగుల బలం వస్తుంది 'డాక్టరు వెళ్ళి గంట గడిచివుంటుంది. యింకా యే విషయమూ తెలియలేదేమిటి ?" అనుకున్నాడు నరహరి. ఇంతలో గది బయట అడుగుల చప్పుడు వినిపించింది. తలెత్తి చూశాడు నరహరి. అతడి కళ్ళు ఆనందంతో చెమర్చాయి. గోపీ. . . .తనకు ప్రాణసమానుడైన గోపీని వెంటబెట్టుకుని యెవరో ఒకతను వస్తున్నాడు. బహుశా 'డాక్టరు' పంపిన వ్యక్తి కావచ్చును.

గోపీ కళ్ళనుండి నీళ్ళు కారుతున్నాయి. వాడు యేడుస్తున్నాడు. తండ్రిని చూడగానే వాడి దుఃఖం పొంగిపోయింది. వాడు వచ్చి మంచంమీద తండ్రి ప్రక్కన కూర్చున్నాడు. నరహరి హృదయం ద్రవించిపోయింది వాడి కన్నీరుచూసి. గోపీని గుండెల కదుముకున్నాడు. 'తన కంతకంటె తీవ్ర



క్కైన దెబ్బలు యెన్ని తగిలినా ఫరవాలేదు. వీడు ముటుకు తన్నేకాకిని చేసి వెళ్ళిపోగూడదు".... నరహరిలో కట్టలు తెంచుకున్న ప్రేమ, వాత్సల్యం, గది అంతా నిండిపోయింది.

"బాబూ" .... నరహరి తల ప్రక్కకు త్రిప్పాడు. మంచం ప్రక్కనే ఒకాయన నిలబడి వున్నాడు. ఆయన మొహంలో మంచితనం వుట్టి పడుతున్నది. ఆయన ప్రక్కనే తానింతకుముందు 'ఆంబులెన్సు'లో చూసిన కుర్రాడు నిలబడివున్నాడు. ఆ కుర్రాడితలకు కట్టుకట్టి వున్నది. నరహరికి విషయం కొంచెం అర్థమయింది. "బాబూ! మీరు మా అబ్బాయి ప్రాణాల్ని కాపాడారని తెలిసింది. 'పేవ్‌మెంటు'మించి కొందరు వెధవలు వాడిని కిందికి తోసేసినప్పుడు రోడ్డుమీద రాళ్ళమీదపడి ప్రుహతప్పిపోయిన వాడిని మీరు రక్షించకపోతే యేమయ్యేవాడో'వని అక్కడున్న వాళ్ళంతా చెప్పారు. మాయింటి దీపాన్ని మీరు కాపాడారు. మీ ఋణం నేను తీర్చుకోలేను......" ఆయన వంగి నరహరి చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆయన కళ్లలో నీళ్ళు మిలమిలలాడుతున్నాయి. "మీ కాళ్ళు పట్టుకున్నా తప్పులేదు. నా ఆస్తి కంతటికీ వారసుడు వీడే. వీడొక్కడే వంశాంకురం మిగిలాడు నాకు. వాళ్ళమ్మ కూడా చనిపోయింది. వీడిని రక్షించి నా ఆశల్ని, వంశాన్ని నిలబెట్టారు. మీకు కృతజ్ఞుణ్ణి.....'

నరహరి తెల్లబోయాడు. 'ఇంతకీ ఆయనెవరు' 'మీ పేరేమిటండీ?' అడిగాడు : సుబ్బారాయు డంటారండి. 'సెంటరులో' మా వెండిబంగారాల కొట్టు మీరు చూసే వుంటారు. "నరహరికి జ్ఞాపకం వచ్చింది. ఈ ఊళ్ళోకల్లా ధనవంతుడైన సుబ్బా రాయుడు యీాయనేనా? ఈయన కొడుకునా తాను రక్షించింది?' 'క్షమించాలి. మీరు పెద్దవారు. పనిగట్టుకుని యిక్కడకు రావడం అనవసరమను కుంటాను. నరహరి అన్నాడు : "అలా అనకండి. మిమ్మల్ని ఓ చిన్న కోరిక కోరడానికి వచ్చాను. అది తప్పక నెరవేరుస్తానంటే అడుగుతాను. అడగమం టారా"? అన్నాడాయన. నరహరిలో ఆశ్చర్యం పెరి గింది. ఈయన కోరికల్ని తను తీర్చడమేమిటి?' కుతూహలంతో 'అడగండి' అన్నాడు. ఆయన కోరిన కోరిక మరీ ఆశ్చర్యాన్ని రేకెత్తించింది నర హరిలో. ఆయన కోరిక అతడిని దిగ్భ్రమలో ముంచి వేసింది. "ఆ అబ్బాయి మీ వాడేననుకుంటాను. వాకు వీ డొక్కడే కొడుకు. వీడు చెడుస్నేహాలతో పాడవు తున్నాడు. వీళ్లిద్దరినీ దగ్గరవుంచి చదివించాలని పిస్తున్నది. అలా చేస్తే మా వాడు తప్పకుండా బాగు పడతాడు. మీకూ ఈ కుర్రావాడొక్కడే అని విన్నాను. నేనూ, మీ తెగకే చెందుతాను. మన యిద్దరి ఆశలూ ఒకటే. కాబట్టి నా కోరికను కాదనకుండా మీరు వాతో మా యింటికి వచ్చివెయ్యాలి. వీళ్ళ ఇద్దరూ బాగా చదువుకుంటే పెద్ద పెద్ద చదువులు చదివించ వచ్చును. ఏమంటారు?" అన్నాడాయన. నరహరి ఆలోచించాడు. "ప్రపంచంలో యింతటి మంచి వాళ్ళుంటారా" అనుకున్నాడు. గోపీకి పెద్ద పెద్ద చదువులు చదువుకుని, గొప్ప పదవులను పొందే 'గీత' వుండవచ్చును. అందుకనే యీాయన వచ్చి తన్నిలా కోరుతున్నాడు. గోపీ భావిలో సుఖపడే అదృష్టం వుంటే దాన్ని తానెందుకు కాదనాలి. ఆయన కోరిక ఒప్పుకోతగ్గదిగా వున్నది. భగవంతుడికి తనపైన యిప్పటికి అనుగ్రహం కలిగియుండవచ్చు. ఇక మంచి తనజీవితం సాఫీగా సాగిపోతోంది. జీవితంలో తనకున్న ఒక్క ఆశా—గోపీ గొప్ప ఉద్యోగం చేస్తూ హాయిగా జీవించడం—అది తప్పక తీరుతుంది: తన జీవితం సుఖాంతం అవుతుంది......"అలాగే నండీ"అన్నాడు. ఆయన మహాసంతోషపడిపోయాడు. నరహరి దగ్గర సెలవు పుచ్చుకుని కొడుకును తీసుకుని వెళ్ళిపోయాడు. "నాన్నా, నేనూ, ఆ అబ్బాయీ యిక్కడేవుండి ఆడుకుంటాము. తరువాత నేను వస్తాను. నువ్వు వెళ్ళు' అన్నాడు ఆ కుర్రాడు. ఆయన అప్పుడే వాళ్లిద్దరూ స్నేహితులైపోవడం చూసి, తేలికపడ్డ హృదయంతో వెళ్ళిపోయాడు.

రాత్రి సుమారు పదిగంటలయింది. ఏదో 'సీరియస్ కేసు'ను చూడడానికి 'వార్డు'లోకి వచ్చిన డాక్టరు రోగుల మంచాల ప్రక్కనుంచి నడుస్తూ, నడుస్తూ, నరహరి మంచం దగ్గర ఆగిపోయాడు. నరహరి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

అతడి పెదవులమీద చిరునవ్వు లీలగా చిందులాడు తున్నది. డాక్టర్ క్షణకాలం నిశ్చేష్టుడై అలానే నిలబడి పోయాడు. "లారీకింద పడి మృత్యుసన్నిధికి వెళ్ళి, అదృష్టవశాత్తూ బయటపడి, రెండు మూడు నెలల వరకూ ఈ దెబ్బనుండి కోలుకోలేడని తా నుద్దే శించిన వ్యక్తి యితడేనా?"

ఆశ్చర్యంతో స్తబ్ధుడై నిలబడిపోయిన డాక్ట రుకు గోడ గడియారం నిశ్చితంగా పదిగంటలు కొడుతున్నప్పుడుగాని స్పృహ రాలేదు. ★

